# వీరేశలింగం ఏం చెయ్యాలి?

ఒక అసాధారణ సమస్య ఎదుర్కొంది వీరేశలింగాన్ని, ఆ పరిస్థితిలో అతనేం చెయ్యాలి? అతనేదో చేసేసి ఆ సమస్యని పరిష్కరించాడు.అతనేం చేశాడో చెప్పేముందు ఆ సమస్య ఏమిటో చెప్పాలి. ఆ సమస్య ఏమిటో చెప్పేముందు మరో విషయం కూడా విశదపరచాలి. "వీరేశలింగం" అంటే మూఢాచారాలని కూలదోసి, సమాజసేవద్వారా నవీన తత్వాన్ని ప్రచారంలోకి తెచ్చి, ఆధునిక యుగకర్తగా ప్రఖ్యాతి పొందిన వీరేశలింగం పంతులుగారు కారని గ్రహించాలి.

ఈ వీరేశలింగం మర్రిపూడి గ్రామస్తుడు. డబ్బున్న ఆసామి. ఎలక్షన్‌లో నిలబడి ఓడిపోయాడు మళ్ళా నిలబడుతున్నాడు. ప్రచారానికి పూనుకుని ఈసారి అతన్ని గెలిపించే బాధ్యత ఉన్నవారిలో నేనొకణ్ణి.

వెనకటి అనాథ శరణాలయంలాంటిది కాకపోయినా ఈయన పతిత స్త్రీల వసతిగృహం నిర్వహిస్తున్నాడు. ఈయనకి వీరేశలింగం పంతులుగారి రచనలపై చాలా గురి. ముఖ్యంగా ఆయన స్వీయచరిత్రంటే యిష్టం. అనాథ శరణాలయాలు నిర్వహించే అవసరం లేకుండా చెయ్యడమే పంతులుగారు చేసిన ముఖ్యమయిన సేవగా పేర్కొంటారు. ఈనాడు ఎక్కడోకాని, వితంతువులు దొరకరు. ఇప్పుడు ఈ వీరేశలింగాన్ని ఆ వీరేశలింగం పంతులుగా మేం ఎవ్వరం అనుకోవడంలేదు. ఎందుకు ఈ ఉపోద్ఘాతమంతా అని ఇది చదివే వారిలో కొందరు చీకాకు పడొచ్చు, కాని ఈ విషయం మొదట్లోనే స్పష్టంగా చెప్పివెయ్యకపోతే, అలా అనుకునే అవకాశం లేకపోలేదు. కారణం ఏమిటంటే, ఇందులో వీరేశలింగానికి సమస్య తెచ్చిపెట్టినామె వితంతువు. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, నాలుగుసార్లు వితంతువు.

ఆమె పేరు మైథిలి. తండ్రి సదాశివరావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వుండేవాడు. ఒక్కతే కూతురవడం మూలాన చాలా గారాబంగా పెరిగింది. తల్లి ఈమెని వదిలి ఒక్క క్షణం కూడా వుండలేకపోయేదిట. అందువల్ల బళ్ళోకి పంపక, ఇంట్లోనే మాష్టర్ని పెట్టి చదువు చెప్పించేవారుట. ఈమెకి పదవఏడు రాగానే సంబంధాలు చూడటం సాగించారు. ఈమె అత్తవారింటికి వెడితే, వదిలి వుండలేరు. తమ దగ్గరే వుండిపోయే అల్లుడు కావాలి. చదువుకున్నవాడూ తెలివైనవాడూ, మర్యాద కుటుంబంలోవాడూ ఐన కుర్రవాడి కోసం వెదుకుతుండగా, మరో నాలుగేళ్ళు గడిచాయి. మైథిలి వయస్సు పదునాలుగు. అప్పటికి ఆమె అందం బయటపడింది. బంగారు బొమ్మ అన్నారు. పెళ్ళిళ్ళ బేరగాళ్ళ ప్రచారంతో ఆమె సౌందర్యం చరిత్ర పైజిల్లాలకి వ్యాపించింది. పైసా కట్నం లేకుండా పిల్లని చేసుకుంటామనీ యే షరతయినా సరే అంగీకరించడానికి సిద్ధంగా వున్నామనీ ఎందరెందరో ఎగబడ్డారు.

ఇంతలో ఇన్‌స్పెక్టర్‌గారి భార్య చనిపోయింది. సదాశివరావుగారికి మళ్ళా వివాహం చేసుకునే ఉద్దేశం లేదు. కాంపులకి వెళ్ళినప్పుడు కూడా మైథిల్ని తీసుకువెళ్ళేవాడు. మరో మూడేళ్ళు గడిచాయి. మైథిలి వయసు పదిహేడు. పెళ్ళిళ్ళ బేరగాళ్ల కృషి ఫలించింది. మంచి సంబంధం తీసుకొచ్చారు. ఒక్కడే కుర్రవాడు. బోలెడు ఆస్తుంది. బి.ఎ. ఫేలవుతున్నాడు. అవుతేనేం, అసలతనికి ఉద్యోగం చేయవలసిన అవసరం లేదు.

మామగార్ని తనదగ్గరే వుంచుకుంటాడు అందరూ కలిసే వుంటారు. చాలా అందంగా వుంటాడు. అతనిపేరు శేఖరం. అన్నింటికంటే ముఖ్యం జాతకాలు బాగా కలిసాయి. ఉజ్వలమయిన భవిష్యత్, రాణీభోగం, చవిచూస్తోంది మైథిలి. కట్నాల ప్రశంసలేదు, వివాహం మట్టుకు అఖండ వైభవంగా జరగాలి.

మహావైభవంగా జరిగింది మైథిలి వివాహం. పెండ్లి పీటలమీద మైథిల్ని చూసిన పిన్నల మతులు పోయాయనీ, పెద్దలు ఆ సౌందర్యాన్ని చూసి, కరిగి కంట నీరెట్టుకున్నారనీ చెప్పుకుంటారు.

పెండ్లికుమారుణ్ని చూసి ఎందరో అసూయపడ్డారుట. అమ్మలక్కలు ఎన్నిసార్లు దిష్టితీశారో లెక్కలేదుట. అందరి దిష్టికళ్ళూ అతనిమీద పడ్డట్లు, వివాహం జరిగిన రెండేళ్ళకే టైఫాయిడ్ వ్యాధికి గురై, చనిపోయాడు శేఖరం. మైథిలి వితంతువు.

ఇన్‌స్పెక్టర్ సదాశివరావుగారు ఆధునికుడు. వెంటనే మళ్ళా వివాహం చెయ్యడానికి నిశ్చయించాడు. పెళ్ళిళ్ల బేరగాళ్ళు సంబంధాలకోసం తిరగడం ప్రారంభించారు. మళ్ళా నక్షత్రాలు, ఋషులు, జాతకాలు గాలించారు. వారి కృషి ఫలించింది. చక్కటి సంబంధం దొరికింది. కుర్రవాడు ఇంజనీరింగ్ పరీక్షకి చదువుతున్నాడు. పై చదువుకి ఇంగ్లండు వెడతాడట. బోలెడు భూమీ, ఇళ్ళూ ఉన్నాయి. ఇద్దరు అన్నగార్లు, ఒక చెల్లెలూవున్నా, మామగారితో వుండిపోడానికి అభ్యంతరం లేదన్నారు. నాజూకయిన, పల్చటి కోలమొహం, పెద్దకళ్ళు, ఉంగరాల క్రాపింగు స్ఫురద్రూపి. జాతకాలు అద్భుతంగా కలిశాయి. పై దేశాలలో చదువు పూర్తిచేసుకుని, పెద్ద ఉద్యోగం తెచ్చుకుంటాడు. నౌకర్లు, చాకర్లు హోదా అమ్మాయి కాలుకింద పెట్టనక్కర్లేదు, రాణీయోగం!

మైథిలి రెండో వివాహం ఎంతో వైభవంగా జరిగిందట. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజులవి. ఇన్‌స్పెక్టర్‌గారికి ప్రమోషనొచ్చింది. బాండ్, నాగస్వరం పాటకచ్చేరి, బేబీ సువర్ణ నాట్యప్రదర్శనం, పత్రికలో ఫోటో, రెండో పెళ్ళిని హర్షిస్తూ ప్రముఖులు పంపిన శుభాకాంక్షలు పందిట్లో చదవడం, ప్రజంటేషనులు. ఆ దంపతులని కొన్ని వందల ఫోటోలు తీశారట. మైథిలి సౌందర్యానికి మతులు పోగొట్టుకున్నవారి సంఖ్య పెరుగుతూ వచ్చిందట. అప్పట్లో ఆ చుట్టుప్రక్కల అంత వైభవంగా జరిగిన పెండ్లి మరొకటి లేదుట.

ఆ రెండో పెళ్ళికి ముందుగానో– తరువాతనో నాకిప్పుడు జ్ఞాపకం లేదు. నేను మొదటిసారిగా మైథిల్ని చూడ్డం జరిగింది. ఏ శుభకార్యమో, ఏ సందర్భమో కూడా ఇప్పుడు గుర్తురావడంలేదు. నాకప్పుడు తొమ్మిదోఏడో, పదోఏడో మైథిలి నాకంటె ఏడెనిమిదేళ్ళు పెద్ద. సాయంత్రం ఆరో ఏడో అవుతుందేమో ముందు వరండా వెనక గదిలో ఉయ్యాల బల్లమీద కూర్చుని ఉంది మైథిలి. గాస్‌లైట్ వెలుగు గదిలో పడుతోంది. నేనక్కడికి వెళ్ళా ఫలానా వారబ్బాయని నన్నెవరో ఆమెకి పరిచయం చేశారు. మైథిలి ఉయ్యాల బల్లమీద నడుం ఆనించి నిలబడింది.

"నువ్వా?" అంది ఒక చెయ్యి నా జబ్బమీద ఆనించి, రెండో చేతి వేళ్ళని నా క్రాపింగు నడుంగా జొనిపి కదిలించి అటూ ఇటూ రాసినట్లు జ్ఞాపకం. అప్పట్లో నేను కాస్త చిరాకుపడినట్లే జ్ఞాపకం. నాది వొత్తయిన ఉంగరాల జుట్టు, దట్టంగా, అందంగా వుండేదనుకునేవాణ్ని. శ్రద్ధతో అమర్చిన క్రాపింగుని ఎవరన్నా చెరిపివేస్తే కోపం వచ్చేది. కాస్తంత చిరాకుపడ్డా, ఆ స్పర్శపట్ల అయిష్టం ఏర్పడనట్లే నా జ్ఞాపకం.

స్త్రీ సౌందర్యాన్ని తిలకించి మనసులో నిలిపి పరామర్శించి ఆనందించగల జిజ్ఞాస ఆనాడు నాలో ఏర్పడలేదని వేరే చెప్పనక్కరలేదు. అయినా కూడా, ఆమె మెరిసిపోయే కళ్ళు తీర్చిదిద్దిన ముక్కు, నిండయిన చెక్కిళ్ళు, నుదిటిని పీడించే దట్టమయిన ముంగురులు, గాస్‌లైట్‌లో ఊదాగా వెలిగిన తెల్లసిల్కు చీరా, ఆమె వంగి నా కళ్లలోకి చూసినవిధం జుట్టు రేపేటప్పుడు ఆ వేళ్ళల్లో తపన ఇవి ఇప్పటికీ తీక్షణంగా నిలిచి పోయిన భౌతికానుభవం, మేఘాలు ఒక్కసారి విడిపోయి నిండు చంద్రుణ్ని బయట పెట్టిన దృశ్యాన్ని స్ఫురింపచేస్తుంది మైథిలి నవ్వు. శీతాకాలంలో తెల్లారగట్ల చలిమంటలముందు కూర్చోడం, గాస్‌లైట్లు, కాగడాలు, దూరంగా సన్నాయివాద్యం, పెద్దగాలికి ఒక్కసారి రాలిన మల్లిపూలు, సంధ్య వెలుగులో మంచు శిఖరం, పసిపాప గుక్కపట్టి తేరుకుని చటుక్కున నవ్వడం, ఇసుకలోపడ్డ చల్లటినీడ, తెల్లరాళ్ళు కనబడేటట్టు తేటగా కదిలే సెలయేరు, వెన్నెట్లో నదిఒడ్డున రెల్లుగడ్డి వెండిజడలా మెరవడం– ఈ దృశ్యాలతో ముడిపడి ఉంది ఆనాటి మైథిలి సౌందర్యం– నా ఊహలో.

మైథిలి భర్త పెళ్ళయిన కొన్ని నెలల తర్వాత పైచదువుకి ఇంగ్లండ్ వెళ్లాడు. రెండేళ్ళు గడిచాయి. ఒకసారి శెలవలకి స్వదేశం వస్తున్నానని వ్రాశాడుట. కాని యే కారణం చేతనో రాలేదు. మరో ఏడు గడిచింది. అమ్మాయిని ఇంగ్లండు తీసుకువెడితే బాగుంటుందని అనుకుంటుండగా తనే వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది ఇన్‌స్పెక్టర్‌గారికి. అల్లుణ్ణి ఆహ్వానించే సన్నాహాలు పెద్దపెట్టున చేస్తుండగా అతను ప్రయాణం చేస్తున్న ఓడ తుఫానుకి గురయి మునిగి– ప్రయాణీకులలో చాలామంది చనిపోయిన వార్త వచ్చింది. మరో నెల రోజులకి ఆ చనిపోయిన వారిలో అల్లుడుకూడా ఉన్న వార్త విని ఇన్‌స్పెక్టరుగారు బెంగతో మంచాన పడ్డాడు. కూతురు ఏ అఘాయిత్యం చేస్తుందోనన్న భయంతో రిటైరయి ఆమెని కనిపెట్టే ఉండేవాడు. కొన్ని మాసాలు గడిచినాయి. కాస్తంత తేరుకున్నాడు. అమ్మాయికి మళ్ళా పెళ్ళి చేస్తేనేం? నలుగురూ అలా చెయ్యమని ఒత్తిడి చెయ్యసాగారు. మైథిలి వయసు పాతిక లోపు. సౌందర్యరాశి. ఎందరెందరో యువకులు, నడివయస్కులు ఆమెచే ఆకర్షింపబడ్డాక, ఏదన్నా జరగొచ్చు. అలాంటిదేదన్నా జరిగితే సమాజం హర్షించదు. తను తట్టుకోలేడు. మైథిలి, మరో వివాహంపట్ల అయిష్టం ప్రకటించనూలేదు.

మళ్ళా సంబంధాలు వెదకటం సాగించాడు. ఈమారు మైథిలి చక్కదనాన్ని మెచ్చుకునేవారి సంఖ్య హెచ్చుగా ఉన్నా, వివాహమాడ్డానికి సిద్ధపడ్డవారి సంఖ్య పల్చబడిందనే చెప్పాలి. సదాశివరావుగారు జాతకాలు కుదిరే ప్రమేయం గురించి పట్టించుకోకుండా తనే స్వయంగా సంబంధాలని వెదకడం ప్రారంభించాడు. నిజానికి ఆయనకి జాతకాలపట్ల నమ్మిక లేదు. అయినా అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని కాదని, పెళ్ళిళ్ళ పెద్దల్ని నొప్పించడం యిష్టంలేక సరేనంటూ వచ్చాడు. ఆయనకి వీటిపట్ల బలమయిన నమ్మిక లేకపోవడమే ఈ అరిష్టానికి కారణం అని సుబ్బావధాన్లు చాటుమాటున అంటూ వచ్చాడు; మొహంమీదనే అనే ధైర్యంలేక "నువ్వు చూసిన జాతకాలూ, పెట్టిన ముహూర్తాలూ యిలా తగులడ్డాయేమయ్యా?" అని ఒకటి రెండుసార్లు సదాశివరావు ఆయన్ని రొకాయించినప్పుడు–

"ఏం చెయ్యమంటారు? సూర్యోదయానికి ముందున్న లగ్నం మంచిదంటే వినిపించుకున్నారు కారు. సూర్యోదయం అయ్యాక వచ్చిన ఘడియలు మంచివన్న ఆ

లక్ష్మయ్య పెట్టిన లగ్నమే కావాలంటిరి, పెళ్ళి కొచ్చేవారికి ఇబ్బంది లేకుండా వుంటుందని. నాకా లగ్నం సుతరామూ ఇష్టంలేదు" అన్నాడుట సుబ్బావధాన్లుగారు.

"అయినా అమ్మాయి జాతకాని కేలోటూ లేదు. మరో పెళ్ళి చేయించే రాత నాకు పడితే ఎవరేం చేస్తారులెండి" అని ముగించాడట. ఇదేమంత నచ్చినట్లు లేదు సదాశివరావుకి. నమ్మకం లేకపోయినా, మరిద్దరి ముగ్గురికి అమ్మాయిలు చెయ్యి చూపించాడు. వైధవ్యం లేదన్నారు. ఆ యిద్దరు ముగ్గురు అమ్మాయిల్లో ఏ లోటూ లేకపోతే తనేదో దోషంచేసి వుండడంవల్లనే తనకి దుఃఖం ప్రాప్తించిందన్న అభిప్రాయం స్థిరపడుతూ వచ్చింది సదాశివరావుగారి మనస్సులో; అవును, తాను చాలా పాపాలు చేశాడు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం కావాలన్న దేశభక్తులపై లాఠీ చార్జీలు జరిపించాడు. విద్యార్థులపై 'టేరగాస్' ప్రయోగించాడు. బ్రిటీషు పాలకులకు అండగా నిలబడి తోటివారిపై అక్రమాలు జరిపించాడు కనుకనే ఈనాడు తనకీ గతి పట్టింది. పశ్చాత్తాపంవల్ల ఈ పాపాలు పోతాయా? పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ, అమ్మాయితో యాత్రలు చేసి వచ్చాడు. యోగులనూ, స్వాములనూ సందర్శించి వారి దీవనలు పొందాడు. హరికథలు, పురాణ కాలక్షేపాలు జరిపినప్పుడల్లా హాజరయ్యేవాడు. అమ్మాయితో కలిసి ఒకరోజున భగవద్గీతకోసం పాత డ్రాయర్లు గాలిస్తుండగా చేతికి సర్వీస్ రివాల్వర్ తగిలిందట. దాన్ని పైకిలాగి చూశాడు. రిటైరవగానే తన దుస్తులు, ఆయుధాలు అధికారులకు ఒప్పగించి వేశాడు. ఈ ఒక్క రివాల్వరూ తన దగ్గరకెట్లా వచ్చిందో జ్ఞాపకం లేదు. తన దగ్గరే ఉండిపోయింది. దాన్ని విప్పి చూశాడు. నాలుగైదు ప్రేలుడు గుండ్లున్నాయి. అలవాటు చొప్పున కాస్తంత ఆయిల్‌పోసి, శుభ్రంగా తుడిచి, గుండ్లను తీసేసి మళ్ళా మడిచి డ్రాయర్లో పెట్టివేశాడుట. దాన్ని పేల్చి చనిపోదామన్న క్షణిక భావాన్ని నెట్టివేసి, ఆ డ్రాయర్‌లోనే మూలగా దొరికిందట భగవద్గీత. నిత్యమూ చదువుతాడు. అమ్మాయిని చదవమంటాడు. రాత్రుళ్ళు భాగవతం చదివేదట మైథిలి. వచనరామాయణం కూడా తెప్పించి ఇరువురూ చదివి ఘనశ్శాంతిని పొందేవారుట. పూజలూ, ప్రార్థనలూ ఫలించినట్లు రెండు మూడు నెలల్లోనే మూడో సంబంధం కుదిరింది. దేశంలో జానాభా పెరిగిపోతూండడం ఓ విధంగా మంచిదేనేమో! అతని పేరు మోహనం వయస్సు ముప్పైదాటవేమో, చేసుకున్న రెండేళ్ళకే అతని భార్య ప్రసవించి చనిపోయింది. బిడ్డా దక్కలేదు. ఇంకే లోటూ లేదు. ఏదో ఇంత వున్నవాళ్ళే. అబ్బాయికి ఆటవిక శాఖలో మంచి ఉద్యోగం ఖాయమైంది. ఆమధ్యనే ప్రమోషనొచ్చింది. సుబ్బావధాన్లు ఖాయపరచిన ముహూర్తానికే మైథిలి మూడో వివాహం శోభాయమానంగా జరిగింది. మోహనం ఇష్టపడి, కావాలని చేసుకున్నా, అతని తల్లిదండ్రులు మొదట్లో కాస్తంత అసమ్మతి వెలిబుచ్చారట. మైథిలి జాతకం మంచిది కాదన్నారుట. ఆమెకి వైధవ్యం రాసిపెట్టుంది. చేసుకోవద్దని ఎన్ని చెప్పినా అతను విన్నాడు కాదుట, మైథిలి సౌందర్యం, గుణం, భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక గ్రంథాలపట్ల ఆసక్తి వీటిని గురించి తెలుసుకున్నాక వారు సమ్మతి తెలిపారుట. పెద్దలు సందేశాలు, శుభాకాంక్షలు పంపారు. "ఈ మారు అగ్నిసాక్షిగా చేసుకున్న వరుడికి ఏ ప్రమాదమూ వాటిల్లదు. అట్లా జరిగితే జందెం తెంచేసి సన్యాసం పుచ్చుకుంటాను" అన్న సుబ్బావధానులుగారి ప్రమాణాలతో జరిగింది పెండ్లి. ఊరేగింపు మాత్రంలేదు. మిగతావన్నీ యధావిధిగా జరిగాయి.

రెండు మూడు సంవత్సరాలు గడిచాయి. నా బి.ఏ. చదువు పూర్తయింది. ఆ

రోజు పరీక్షల ఫలితాలు పత్రికలో ప్రకటించారు. పాసైన సంతోషంతో మిత్రులతో హోటల్‌కి వెళ్ళాను. సాయంత్రం అక్కడ మిత్రుడు ధర్మారెడ్డి చెప్పగా విన్నాను మోహనం చనిపోయిన విషాదవార్త. అదిలాబాద్ అడవుల్లో ఏదో సర్వే జరిపి, కొన్ని కొత్త నిబంధనలు అమలు జరపడంకోసం వెళ్ళాడట. వారం వుండి పని ముగించుకుని రాబోయే ముందు పులివేటకి అక్కడివారితో వెళ్లాడుట. చెట్టుమీదనుండి తుపాకి పేల్చాడుట- పులి గాయపడిందిగాని చావలేదుట, చెట్టుదిగి తోటి వారి మాట వినక పొదల్లోకి ఆ గాయపడిన పులిని వెంటాడుతూ వెళ్లాడుట. గాయపడిన పులిని చంపకపోతే ప్రమాదమన్న విషయం గ్రహించి కాబోలు! వెళ్ళినవాడు తిరిగి రాలేదుట. ఈ వార్త విన్నప్పుడు నా కళ్ళంట నీళ్ళు తిరిగాయి. మైథిలి తండ్రి సదాశివరావుగారు యీ ఆపదని తట్టుకోలేదనిపించింది. ఆయన మంచాన పడ్డాడుట. కీళ్ళవాతం అన్నారుట, చికిత్స చేయించారుట.

మాట దక్కలేదు. ఆయన చనిపోయాడు. మైథిలి మేనత్తతో వుంటోంది. మేనత్త కొడుకు సూర్యం స్కూల్లో చదువుకుంటున్నాడు. మైథిలిది మంచి ఆస్థి. పెద్ద మేడ కట్టించింది. అందులో ఉంటున్నారు, ఆమె మేనత్తా, సూర్యం.

మరో ఏడాది గడిచాక శెలవల కొచ్చినప్పుడు మైథిల్ని చూసే అవకాశం ఏర్పడింది. నాకు మా పెదతండ్రి కొడుకు, సబ్ కలెక్టర్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. అతని ఇంట్లోనే వుంటున్నాను. అప్పుడు రాయలసీమలో క్షామం ఏర్పడింది. అక్కడివారి సంక్షేమానికి విరాళాలు పోగుచేయ సంకల్పించి, ఆఫీసువాళ్ళు 'కన్యాశుల్కం' నాటకం ప్రదర్శించడానికి పూనుకున్నారు. యాజమాన్యం సబ్‌కలెక్టర్ సర్వోత్తమరావుది. వాళ్ళ ఆఫీసులో టైపిస్టు అరుణ మధురవాణి వేస్తానంది. కాని వాళ్ళకి బుచ్చమ్మ దొరకలేదు. పదిమైళ్ళ దూరంలో వున్న ఊళ్ళోనే ఉంది మైథిలి. ఎవరు వెళ్ళి మాట్లాడాలో, ఎలా ఒప్పించాలో నాకు తెలియదు కాని, మైథిలి ఆ పాత్ర నిర్వహించడానికి ఒప్పుకుందట. రిహార్సల్స్ ఆమె మేడలో గదిలోనే జరిగేవిట. నే నొచ్చిన రోజునే నాటకం.

బుచ్చమ్మ వేషంలో మైథిల్ని చూడ్డానికి కాబోలు జనంతో స్కూలు హాలు కిటకిటలాడింది. నిర్వాహకులు కోరినట్లుగానే ఆమె వేషం ధరించింది. కాని రవ్వలదిద్దులు మాత్రం తీసేయడానికి ఆమె ఒప్పుకోలేదు. మా వాళ్ళతో కలిసి నేనూ స్టేజిలోనే వుండి సైడుకర్టన్‌ల వెనక నిలబడి చూస్తున్నాను. నన్ను చూసి నవ్వింది. మైథిలి తెర లేవగానే చాలా భయపడింది. ప్రేక్షకులకేసి చూడకుండానే కూర్చుని ఉంది. సైడుకర్టన్‌ల మధ్యలో వున్న నాకేసి చూసింది. నిలబడమని కేకవేశారు జనం. ఆ రెండు డైలాగులూ చెప్పి లోనకొచ్చేసింది. బుచ్చమ్మ నూతి పళ్ళెం వెనక వున్నట్లు ఊహించి రంగస్థలంపై పాత్రను సంబోధిస్తూ ఎలాగో ఆ రంగం ముగించాడు గిరీశం పాత్రధారి, గురవారెడ్డి. రంగస్థలంపై మైథిల్ని చూడగానే నా కళ్ళంట నీళ్లు తిరిగాయి. ఆమె అంత అందంగా వుంటుందని ఊహించలేకపోయానేమో. మానవుడి వూహ ఎంత సంకుచితమయిందో కదా ననుకున్నా. స్టేజి కట్టిన హాలు వెనక గది దాటి వరండాలో బెంచీమీద కూర్చున్నాను. ప్రశాంతముగా ఉంది. ఏవో ఆలోచనలు.

"నువ్వా?" అన్న కంఠం. మైథిలి పక్కనే నిలబడి వుంది.

"గుర్తుపట్టావే?" అన్నాను. బయట పల్చటివెన్నెల మెత్తగా వరండాలోకి సోకుతోంది. కాని, బాగా కనబడటము లేదు- ఏమిటో, వెలుగు నడుమ చీకటి కాంతి కదిలినట్లు, సూర్యబింబంకేసి కన్ను మూయకుండా చూసింతరువాత చూస్తే ఎరుపు సున్నా కేంద్రంలో నలుపు మెదిలినట్లు స్థావరమయ్యే గగుర్పాటొకటి నన్నావహించింది.

"ఓ ఉయ్యాల ఊగుతుండగా వచ్చావుగా. ఇట్లా చేశానుగా" అంది మైథిలి, నా తల వెంట్రుకల్ని వేళ్ళతో కదుపుతూ. ఆ వేళ్ళలో ఎంత పదునుందో, చిన్నప్పుడు నే నెరుగని స్పర్శస్మరణతో రెండింతలై ఇప్పుడు తెలిసొచ్చింది. నా బుగ్గమీద కన్నీటితడికి ఆమె చెయ్యి తగిలింది.

"నాకు తెలుసులే" కాసేపు ఎవ్వరం మాట్లాడలేదు. తనే అంది మళ్ళా. "నాకీ నాటకం ఏమిటి?" నా ఒళ్ళో వాలిపోయింది మైథిలి. నా చేతుల్ని ఆమె నడుంచుట్టూ లాక్కుంది. చీర అడుగున పరికిణి బిగింపుకి చర్మంపై రేగిన వెచ్చని మడతలు వేళ్ళకి తగిలి సముద్రపుటొడ్డున గాలికి పాయిలుగా రేగిన తెల్లటి ఇసుకలో మొహం దాచుకున్నట్లయింది.

"బెంగేస్తుంది నీ విషయం" అన్నాను బొంగురుపోయిన నా కంఠం ఆశ్చర్యంగా ధ్వనించింది.

"నాకు తెలుసునన్నాగా."

వేదనతో ఆమె రొమ్ములు వేడెక్కి, బరువై నా చుట్టూ గుండ్రటి శక్తి వ్యాపించినట్లయింది. నా నుదుటినీ, నోటినీ, మొహాన్నంతటినీ కమ్మివేసి, చటుక్కున మాయమయి శూన్యాన్ని దిగవిడిచినట్లయింది. ఆమెకు ఏం తెలుసో నాకు తెలిసింది కాదు కాని ఆమె మాత్రం ఆ క్షణంలో నాకు తెలిసిపోయినట్లనిపించింది. ఆమె వెళ్ళిపోయినట్లే గమనించలేదు. కూసం విడిచేసినట్లు ఆమెలో ఏదో భాగం నాలో ఉండిపోయి, మరో నేనుగా మిగిలిపోయిన అనుభూతి ఎప్పటికీ మరచిపోలేను.

లా చదువు పూర్తయింది. పరీక్షలు అయ్యాయి. ఫలితాలు తెలియాలి మా వాడి ఉత్తరం ద్వారా తెలుసుకున్నాను. మైథిల్ని వాళ్ళ సబ్ కలెక్టర్ సర్వోత్తమరావు చేసుకొన్నట్టు. సంతోషించాను. సర్వోత్తమరావు తెలివైనవాడు. మనిషి రూపం కూడా బాగానే వుంటుంది. ఎటొచ్చీ అతనిలో నాకు నచ్చినది చిన్నప్పుడు చుట్టతో కాల్చినప్పటి నుదిటిమీద మచ్చ. మంచి ఉద్యోగం. అతడు కనపర్చిన ధైర్యసాహసాల్ని మెచ్చుకోకుండా వుండలేను కారణం ఇది. మైథిలి జాతకంలో తిరకాసున్నదన్న పుకారు ముగ్గురు భర్తల మరణంతో, బాగా ప్రచారమయి స్థిరపడిపోయింది కూడా. నుదుటిమీద పాపిడి దగ్గర సుడి వుందట ఆమెకి. అందుకనే మధ్య కాకుండా కాస్త పక్కన పాపిటతీసి ముంగురులను వదిలేస్తుందట మైథిలి.

ఆమె ఎప్పుడూ వితంతువుగా ఉండటం తప్పదన్నారు. అగ్ని సాక్షిగా పెళ్ళి చేసుకొన్నవాడు చావడం తప్పదన్న నినాదంగా రూపొందింది ఈ వదంతి. ఒకటి రెండు సర్ప దోషంలాటి దోషాలున్నాయని వాటి నివారణకి ఆమె తండ్రి సదాశివరావు చెయ్యవలసినవన్నీ చేశాడనీ, ఇప్పుడు ఇంక ఏమి చేసిన లాభంలేదని చేసుకున్నవాడు చస్తాడనీ నిర్ధారణయిందన్నారు. ఆమె సౌందర్యాన్ని మెచ్చుకొనేవారే తప్ప ఆమెని చేసుకోడానికి సాహసించేవారు కనబడడంలేదు. కొందరికి ఒక వ్యక్తిమీద పగవుంటే ఆ వ్యక్తి మైథిలిని వివాహమాడితే బాగుంటుందని అలా జరిపించే యత్నాలు పూనుకుంటున్నా రనుకోవడమూ వుంది. సర్వోత్తమరావు ఆఫీసులో పనిచేసేవారిలో చాలమంది అతను ఆమెను కట్టుగొంటే బాగుండును విరగడయిపోతాడు అనుకొనేవారట. అతను ఆఫీసు వ్యవహారాల్లో చాలా స్ట్రిక్టుగా వుంటాడట జావ్యాన్ని సహించడుట. శీలం గలవాడు. నైతిక విలువల్ని నిత్య వ్యవహారాల్లో అమలు జరిపి చూపాలన్న ఆదర్శం కలవాడవటం

వల్ల ఆఫీసులో ఎవరన్నా డబ్బు విషయంలో కక్కుర్తి పడినట్లు నిదర్శనం దొరికితే వారిపై చర్య తీసుకుని శిక్ష పడేటట్లు చేస్తేగాని నిద్రపోడుట. ఈ వైఖరి ఆఫీసులో వారికి నచ్చేదికాదు. ఆయన మైథిల్ని చేసుకోడం తప్ప మరో మార్గంలేదు. అనుకొనడం ఒక "జోక్"గా తయారయిందట. ఆయన ధైర్య సాహసాల్ని నిజాయితీని ఆదర్శత్వాన్ని వెక్కిరించి హేళన చేసేటప్పటికి అతనికి బాగా 'కిర్రె'క్కిపోయి ఆమెని చేసుకుతీరతాను అని నిర్ణయం నలుగురికీ తెలియచేసేటప్పటికి వారంతా విస్తుపోయారుట. అతని పై అధికారులు మేలుకోరే వారూ వద్దన్నారుట.

"ఆమెని అగ్నిసాక్షిగా వివాహమాడినవాడు బ్రతకడు అనేగా పెద్దల తీర్పు? సరే కానివ్వండి. అగ్నిసాక్షిగా వివాహమాడను. వూరికే ఆమెతో వుంటాను" అన్నాడుట మిత్రులతో ఆశ్చర్యపడ్డారుట.

"ఏమిటి మీరనేది. ఉంచుకోవడమా!"

"కంగారుపడకండి రిజిస్టర్డు మారేజి అంటూ వుందిగా" అని నవ్వేశాడు సర్వోత్తమరావు.

నలుగురూ అతని తెలివిని అభినందించారు. వద్దన్న పెద్దలు కూడా హర్షించారుట చడీ చప్పుడూ లేకుండా ఎక్కడ ఏ విధంగా రిజిస్టర్డు మ్యారేజి జరిగిందో వివరాలు దొరకలేదు. మైథిల్ని చేసుకున్నాడు చేసుకున్నాడోలేదో! వాళ్ళిద్దరూ కలిసే వుంటున్నారు ఆమె మేడలో. కార్‌లో ఆఫీసుకొస్తూ వుంటాడు. ఆఫీసులో ఇదివరకటంత స్ట్రిక్టుగా వుండటంలేదుట చిన్న ఉద్యోగులపై ఆదరణ చూపసాగాడుట చాలా బాగుంది- పరిస్థితులు చక్కబడ్డాయి అనుకుని చుట్టుపక్కలవారు నిట్టూర్చారు.

ప్లీడరీ పట్టా పుచ్చుకుని, ప్రాక్టీసు పెట్టేటందుకు అవసరమైన తతంగం జరిపి మరుసటి సంవత్సరం శ్యామలరావు దగ్గర జూనియర్‌గా చేరాను. సర్వోత్తమరావుకి బదిలీ అయిందట. ఆయనా, మైథిలీ ఆ కొత్త చోటికి వెళ్ళిపోయారుట. వారిని గురించిన వార్తలు, మరో ఆరు నెలలకి తెలిశాయి. మైథిలికి నాలుగో మాసంట. ఇది వినగానే మొదట్లో నాలో వున్న సంతోషం
ఎందుకో కాస్తంత తగ్గిందనే చెప్పాలి. సౌందర్యం అందరికీ సమంగా చెందాలి. ఏ ఒక్కరి సొత్తూ కాకూడదంటారు కొందరు. నంగాపర్వత శిఖరం, తాజ్‌మహల్, సంధ్య అందమైనవి. ఇవి ఏ ఒక్కరికీ చెందవు. అలాగే సౌందర్యమైన స్త్రీ కూడా అంటున్నారు. నేను పూర్తిగా అంగీకరించలేకపోతున్నాను. అందమైన స్త్రీ వివాహమాడి ఒకరి సొత్తవగానే "అమ్మయ్య" అనుకొని నిశ్చింతగా ఉండగలను. ఒకరి సొత్తవగానే, మనకింక ఏ రకమైన పూచీ, ప్రమేయమూ వుండదు. పైగా, నంగాపర్వత శిఖరం, తాజ్‌మహల్ వీట్లకి వార్ధక్యంలేదు. స్త్రీ సౌందర్యం పెరుగుతుంది. తరుగుతుంది నశింపవుతుంది. అట్లా జరక్కుండా శాశ్వతంగా కనీసం ఆ స్త్రీ జీవితాంతం వరకూ ఉండగలిగితే, అది ఎవరి సొత్తూ కానక్కర్లేదన్న భావాన్ని బలపరుస్తాను. పిన్నలకి స్వార్థం హెచ్చు కాబోలు. ఆ వార్త విన్నాక ఎందుకో చికాకుపడ్డాను. మరో రెండు నెలలకి మరో వార్త విని బాధపడ్డాను. సర్వోత్తమరావు కాన్సర్ వ్యాధికి గురయ్యాడుట. చికిత్సకి బెంగుళూరు వెళ్ళారుట. ఆపరేషనన్నారుట. బొంబాయిలో పెద్ద డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళారుట. ఆపరేషన్ జరిగిందట. నెల గడిచాక సర్వోత్తమరావు చనిపోయాడుట. యేడుపొచ్చింది. అతని వ్యాధి కాన్సర్ కాదు. "మైథిలైటిస్" అనబుద్ధివేసింది.

మైథిలి మద్రిపూడి వచ్చేసింది. అక్కడ భూములున్నాయి. తోటుంది. తోటలో పాతిల్లుంది. దాన్ని బాగుచేయించి మేనత్తతో కలిసి వుంటోంది. ఆ ఇంట్లోనే ప్రసవించింది. మొగశిశువును కన్నది. రెండు రోజుల్లోనే బిడ్డ చనిపోయింది. సమాధి చేశారు. ఇది జరిగిన మర్నాడు నేను వెళ్ళేటప్పటికి చీకటి పడింది. ఏడు కావొస్తోందేమో తోటలో ఇంటిముందు జనం వున్నారు. పాలది, చాకల్ది, ఇరుగు పొరుగువారూ, పనివాళ్ళు, నే వచ్చిన కబురు తెలిసి లోపలికి రమ్మన్నారు. మండువా గదిలో ఉయ్యాలమీద పరుందీ మైథిలి. చుట్టిన పరుపుమీద నడుం ఆనించి చేతులు మెడకింద బిగించి పడుకునుంది. ఊదారంగు చీర, మెడలో పగడాలు, చెవిమీద జారిన జుట్టులోంచి సగం కనబడే రవ్వల దిద్దులు, చేతులకు వెడల్పాటి గాజులు, జడంతా వూడి పరుపుమీద నుంచి జారి పడుతోంది పక్కనే వెళ్ళి నిలబడ్డా, కళ్ళు మూసుకునివుంది. చెవుల దగ్గర చెంప బరువెక్కినట్లుంది. కళ్ళ క్రింద నలుపు, లైటు వెలుగులో దట్టంగా కనబడుతోంది. కనురెప్పల నీడలు బుగ్గమీద పడుతున్నాయి. అనుభవంతో పెరిగింది మైథిలి. అప్పటికి వయస్సు ముప్పై ఉంటుందేమో. ఇరవై తరవాత నాజూకు నిలబడదంటారు. కాని మైథిలి చక్కదనానికి, వయస్సు నిండుదనాన్ని యిచ్చినట్లుంది. ఒక హుందాతనం, అదుపులోకి తెచ్చుకున్న గడుసుతనం. స్థిరబద్ధ దృక్పథంతో నిశ్చలంగా లోకాన్ని తిలకించగల ఏకాగ్రత మైథిలి ఆకృతికి పరిపూర్ణత సమకూర్చిందనిపించింది. కళ్ళు తెరిచి చూసింది.

"నువ్వు?"

అలాగ కాసేపు చూచి, పైకి లేచి, కళ్లలోకి లోతుగా చూస్తూ, నా తలమీదికి చెయ్యి పోనిచ్చి జుట్టుని వేళ్ళతో కదుపుతూంది.

"ఇట్లాగైపోయింది" అని పెట్టున కేకవేసి నా తలని తన రొమ్ములమీదికి లాక్కుని, వెనక్కి వాలిపోయి, ఉక్కిరి బిక్కిరవుతూ ఒక ఫిట్ వచ్చినట్లుగా ఏడ్పు సాగించింది. యే అవయవమూ కదల్చడానికి వీలులేకుండా ఊపిరి ఆడనీకుండా వక్షానికి అదుముకుంటోంది. కన్నీరు మీదపడుతోంది. ఆవేదనతో స్థనాలు లేచిపడుతున్నాయి. పాలతో నిండి గట్టిపడిన స్థనాలు, యేదో అతిశయోక్తితో కూడుకున్న రోదన, శ్వాస మూలుగు వీటి నడుమ తల్లడిల్లిపోయాను. జాకెట్ విడిపోయే ఉంది, గుండెలో ఆరాటం తుఫానుకి రేగిన కెరటాలల్లే స్థనాల నడుమ చెలరేగి, నన్ను కదిపివేసింది.

అదొక ఉన్మాదం లాంటిది. వెనక బుచ్చమ్మ వేషం ముగిశాక ఆమెలో ఒక ఉద్రేకం వచ్చింది. కొంత నామీద పారవేసి, పంచుకుంటేనే కాని ఆమెకి శాంతి దొరకలేదు. మళ్ళా ఇప్పుడూ అలాంటి ఉద్రేకమే. ఆమె వ్యక్తిత్వపు ప్రకర్ష జ్వాలలా లేచి నన్ను దహించి వేసింది.

నే నిదివరలో పరామర్శించని వింత బాధ, జీవితంలో పెనుగులాట. సృష్టితో సమరం. ఉద్రేకమే ప్రాణి. యవ్వనానికి బాధ తెలీదు. ఉద్రేక ప్రకర్ష నాగరికుల లక్షణం కాదు. వ్యాపిస్తూ వున్న అనంత విశ్వంలో, అల్పమైన భూగోళంలో అణుమాత్రుడైన మానవుడి కధనానికి ఉద్రేకం ఒక వ్యాఖ్యానమా! వింత కోణంలో అవయవాలు పీడిస్తుండగా ఆమె కౌగిటిలో వేగిపోయాను. ఆమె పరస్త్రీ కాదు. నేనెరిగున్న మనిషి కాదు. నేను, నేనుకాను. రెండు ప్రాణులు మృత్యువుకి భయపడి పారిపోయి, ఒకరిలో ఒకరు దాక్కోడములాంటి ఒక లీల అదంతా నేను ఏడ్చేశాను. అలా ఎంతసేపో- ఆమె కళ్ళు మూసుకుంది. వేళ్ళపట్ల దిగజారుతున్నాయి. శ్వాసస్థాయి పడుతోంది. ఆమె తేరుకుంది.

మంచినీళ్ళు తీసుకురమ్మంది. మళ్ళా 'నువ్వొద్దులే' అని ఎవర్నో పిలిచింది. నీళ్ళతో మొహం తుడుచుకుంది. పక్కకి తిరిగి జాకెట్టు బిగించి, చీరకొంగు సర్దుకొంది. పగడాలదండ మెడచుట్టూ తిప్పింది.

"నే నేమన్ను?" అన్నాను.

"నాకు తెలుసు."

"నే నేం చెయ్యను?" అన్నాను మళ్ళీ. నా చేతిని తన అరచేతిలో తీసుకొని నలుపుతోంది. అరచెయ్యి పరచి రేఖలు చూస్తూంది.

"అనేటందుకు ఏమీ వుండదు కదూ!"

నే నేమీ మాట్లాడలేదు.

కాసేపు బాధ తగ్గినట్లయింది.

వెడతానని లేచాను.

"మళ్ళా కనబడేం!"

వచ్చేశాను.

* * *

నాకు తెలుసు వీరేశలింగం సమస్య ఒకటుందని, అదేమిటో చెప్తాననీ ప్రారంభించి, అదేమిటో చెప్పక మైథిలి విషయం మొదలెట్టి, పుట్టినప్పటినుండీ ఆమె చరిత్ర చెప్పుకొస్తూ పేజీకి ఒక పెళ్ళి చొప్పున చేయిస్తూ, మధ్యలో తన గొడవ కొంత ఇరికిస్తూ కాలయాపన చేస్తున్నాడు అని మీరు విసుక్కొంటారని ఆ భయం ఒకమూల నన్ను పీకుతూనే వుంది.

అవును, కథలో అప్రస్తుతమయిన వాటికి తావులేదు. ఏదో ఒక సంఘటన ఒకచోట జరిగిన ఉదంతం ఒకరిద్దరికి సంభవించిన వాటిని యేకాగ్రతతో ఐక్యతను కనబరుస్తూ చిత్రించి విశిష్టమయిన కళానుభూతిని కలగచెయ్యాలి రచయిత. అవును పాఠకుడు ఇలా శాసిస్తే తలొగ్గుతాను. మైథిలి కథ పుట్టినప్పటినుండి చెప్పదల్చుకుంటే నవల వ్రాసుకో. ప్రస్తుతం వీరేశలింగం సమస్య యేమిటో క్లుప్తంగా చెప్పు అని శాసించడం సబబే. సంక్షిప్తతే కథలో ప్రత్యేకత.

నిజానికి ఈ వెనకటి చరిత్రంతా చెపితేకాని వీరేశలింగం సమస్య ఏమిటో విశదపడకపోవచ్చు. అసలు సమయమే లేకపోవచ్చు. ప్రాణి పుట్టాక ఆ ప్రాణి చచ్చిందని అరవై డెభ్భైయేళ్ళ చరిత్రనంతా ఒక్కవాక్యం సంక్షిప్తపరచి దించి ముగించడంలో ఒక్క సృష్టికారకుడికే సాధ్యం. ఆరేళ్ళయితేనేం! ప్రాణి చావడము తప్ప చేసేదేముంది? ఉన్నా, చచ్చినా, సృష్టికి జరిగే ప్రమాదము యేముంది? విశ్వంలో తిరుగాడే కోట్లాది గోళాలకి ఈ భూలోకములో ప్రాణుల ప్రమేయముంటుంది కాబట్టి "చావు" అని రెండు అక్షరాల మాటతో సృష్టి! సంక్షిప్తపరచే కార్యక్రమాన్ని కొనసాగించగలదు.

నే నాపని చెయ్యలేను. కోట్లాది గోళాల దృష్ట్యా అల్పుణ్ణే. కాని నేను ఇప్పుడు కోట్లాది గోళాలతో నిండిన అనంత విశ్వం గురించి వ్రాస్తున్నాను. నాకు పుట్టుకలతో ప్రమేయములేదు నిమిత్తములేదు. ఆ నడుమ యేమి జరిగినదో కావాలి నాకు. ఆ నడుమ బ్రతికి వుండవచ్చు ప్రాణి– ఊపిరి తియ్యొచ్చు, అదీ ముఖ్యం కాదు. ఆ ప్రాణి సజీవమై వుందా? అంటే యే ఘడియల్లో? ఎప్పుడు? ఎందుకు! సజీవమయి

వ్యాప్తిచెందుతూ ఆ సజీవశక్తి కేంద్రం విశ్వమంతటా వ్యాపింపచేయడం సాధ్యమా! ఇదిగో ఈ ప్రశ్నలకు సమాధానం వెదికే కథనం జరిపినప్పుడు సంక్షిప్తతను ఆరాధిస్తాను, అంతవరకూ ఓపికపట్టమని కోరుతున్నాను.

వీరేశలింగం ఎవరోకాదు. శ్యామలరావు దగ్గర నేను జూనియర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పాను. ఆ శ్యామలరావు తమ్ముడే వీరేశలింగం. స్థితిగల బంధువుకి దత్తతయినవాడు. బోలెడంత ఆస్థి సంక్రమించింది. బి.ఎ. పూర్తవకుండానే భూములు చూసుకుంటూ మరొక బిజినెస్ కూడా పెట్టి మర్రిపూడిలో మేడ కట్టుకొని సంఘసంస్కర్త కావాలని ఎలక్షన్‌లో నిలబడి ఓడిపోయాడు. ఈసారి తప్పకుండా గెలిచి తీరతాడని చుట్టుపక్కల వారు హామీయిచ్చి, తగు కృషి చేస్తున్నారు. అతని వయస్సు యాభై. ఒక ఆడపిల్ల, ఒక మొగపిల్లవాడు అంతే సంతానం. పదేండ్ల క్రితం భార్య చనిపోయింది. మళ్ళా వివాహం చేసుకోలేదు. మైథిల్ని చూశాక మతిపోయింది– అంటే మనస్సు పోయింది– వ్యాకులత రేగింది. ఆమె అతనికి కావాలి. మానసిక స్నేహమా? సౌందర్యం ద్వారా సంస్కారాన్ని సాక్షాత్కరించడమా? నట్టేట్లో సుడిగుండాల నడుమ తారట్లాడుతున్న నావకి చుక్కానా? పరమాత్మలో ఐక్యం అవడానికి ఇదొక ఐహిక ప్రక్రియా? ఏమో!

వ్యవహారరీత్యా అప్పుడప్పుడు మైథిలి, శ్యామలరావు గారితో సంప్రదించడాని కొచ్చినప్పుడు, యీ భావం ఉదయించింది వీరేశలింగంలో. పంతులుగారి రచనలు చదివాడు. ఆమె వితంతువుగా వుంటే అతని గుండె తరుక్కుపోయింది. పురుషుణ్ని ఉత్తేజపరచి మంచి కార్యాలకు పురిగొల్పే ఆ సౌందర్యం అలా వృథా అయిపోవాల్సిందే? వారి భూములు పక్క పక్కనే. ఆ బోదెలోంచే పోలాలకి నీరు ఆ పెద్ద కాలువలోంచే ఆ ఊరే–ఇద్దరికీ స్నేహం కలిసింది.

కాని నలుగురూ కూడదన్నారు. ప్రమాదం అన్నారు. బ్రతకడం ఇష్టంలేదా? అని ప్రశ్నించారు. మైథిలి గతం మరిచావా? పెండ్లాడినవాడు చస్తాడన్న దొక్కటే కాదు; మొదటి ముగ్గురు భర్తలూ అలా చచ్చినవారే అగ్నిసాక్షిగా వివాహమాడక, ఆమెను రిజిష్టర్డు మారేజీ ద్వారా భార్యగా స్వీకరించిన సర్వోత్తమరావు ఏమయ్యాడో మరిచావా? ఆమెని తాకినవాడు మరి ఉండడు. ఆమెతో శరీర సంబంధం పెట్టుకున్నవాడు చచ్చితీరుతాడు.

మరి వివాహమాడకుండా శారీరక సంబంధం ఆశించకుండా మైథిలితో ఉండాలంటే ఏం చెయ్యాలి? అదే వీరేశలింగం సమస్య.

దీనితో ముడిపడ్డ మరో సమస్య. తనకిది సమస్యగా పరిణమించినట్లు మైథిలికి తెలియకుండా ఉంచడం. కాని తనని వివాహం చేసుకున్న వాడికి ముప్పు వాటిల్లుతుంది, అని జనం అనుకుంటున్నారనీ, తానింక వివాహం ఆశించడం కూడదనీ మైథిలి గ్రహించకుండా ఉందనుకోడం కష్టం. ఆమెని పెండ్లి చేసుకోకుండా, ఏ రకం భౌతిక సుఖాన్నీ కోరకుండా వీరేశలింగం మైథిలీ స్నేహం కుదుర్చుకుని, కలిసి వుండగలగడం విశేషమే. అది ఒక కొత్తరకం కలయిక. ఎప్పుడూ ఎక్కడా జరగదేమో వీరేశలింగంది చామనఛాయ. మొన కాస్తంత వంకర తిరిగినా, పొడుగాటి ముక్కు, పెద్ద కనుబొమ్మలు, కళ్ళు కళ్ళద్దాల వెనక మామూలుగానే కనబడతాయి. గుండ్రటి దట్టమయిన పెదవులు, క్షవరం డాబు బరువుగా కనబడే గడ్డం రెండువైపులా పొయ్యిలా వెనక్కి జరిగినా, మిగిలిన క్రాపింగు ఎగదువ్వి నీట్‌గా వుంటుంది. ఎత్తరే . కాస్తంత స్థూలకాయం అవడం మూలాన ఎత్తరిగా కనబడడు. అయినా అతని అందచందాల జోలి నాకెందుకు? నేనేం చేసుకోబోవటం లేదుగా?

మొత్తానికి యేడెనిమిది నెలలు గడిచాక వారిద్దరు కలిసి వుంటున్నారని విన్నాను. మద్రిపూడిలోనే మకాం. పై ఊళ్ళో కొత్తమేడలో, మేనత్త ఆమె కొడుకు సూర్యం- ప్రతివారం ఆమె కారుపంపితే రెండు రోజులు గడిపి మంచి చెడ్డా కనుక్కొని వెడుతూ వుంటారు. వీరేశలింగం కూతురు మరోచోట హాస్టల్‌లో వుండి చదువుకుంటోంది. కొడుకు కాలేజిలో ఉంటాడు, నౌకర్లు, తోటవాళ్ళు, బిజినెస్ నడిపే ఉద్యోగులు సందడిగా వుంటోంది. మైథిలి ప్రోద్బలం పైననే పతితస్త్రీల వసతి గృహంకూడా పెట్టడం జరిగింది. అప్పటికి పదముగ్గురు అందులో చేరారట. వాళ్ళకి కుట్టుపనులు, పాటలు, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు తగ్గ సిబ్బంది ప్రభుత్వం వారి సబ్సిడీతో ఏర్పాటయింది. మొదట్లో జనం అనేక రకాలుగా చెప్పుకుంటున్నా, రానురాను ఆ కలయికని ఆమోదించి, సరిపెట్టుకున్నట్టే తోస్తుంది. లోకం ఎప్పుడూ ఒకర్ని గురించే పట్టించుకోదు. కొత్త వ్యక్తులు కొత్త సంఘటనలు ఉంటూనే వుంటాయి. వారి మానసిక సంచలనానికి అనువయిన ప్రక్రియగా.

అది వేసంగి. పై ఊరెళ్ళి ఒక పెండ్లి సంబంధం చూసివచ్చా ఆ మధ్యాహ్నమే నా వరస చూస్తే నాకు పెండ్లి అవుతుందా అనిపిస్తోంది అన్నీ కలిసిరావడంలేదు. చక్కదనం వుంటే చదువుండదు. చదువుంటే స్థితి ఉండదు. నక్షత్రమో, ఋషులో అడ్డుతగల్డం ఒకటి పైగా. ఏదో ఉన్న వాళ్ళలోనే ఒకామె బాగుంది అనుకుంటుండగా మరెవరో పుట్టి మునిగి పోయినట్లు వెళ్ళి తాంబూలాలు పుచ్చుకున్నారట. జాతకాలు చూడొద్దన్నాను. కాని నామాట వినేదెవరు ? అమ్మాయి తాలూకు వాళ్ళు అవి చూపిస్తేగాని వీల్లేదంటున్నారు. కట్నం అక్కర్లేదు నాకు అంటున్నాను. మావాళ్ళంతా పుచ్చుకు తీరాలంటున్నారు.

లేచి స్నానం చేసి, ఇంత టీ తాగి అలా షికారుగా నడిచొద్దామని బయలుదేరుతుండగా మైథిలి కారు పంపి తనింటికి రమ్మనమంది. వెళ్ళాను. సంధ్య చెట్ల వెనక జారిపోతోంది. రెండు మూడు నక్షత్రాలు కన్నుమీటు తున్నాయి. చల్లటి గాలి చెట్ల నడుమ దాగిలిమూతలాడుతోంది. ఎవరో అమ్మాయి వసతిగృహం తాలూకా పైకి తీసుకువెళ్ళింది. మైథిలి ఉయ్యాలపై కూర్చుని ఉంది. దీపం లేదు. యింకా చీకటి ముసుగు తన్నలేదు.

"నువ్వా ?"

"అవును."

"రమ్మనగానే వచ్చావే!"

"రాకుండా ఉండగలనా?"

నవ్వింది. కూర్చోమని తను పక్కకి జరిగింది. ఎర్రరంగు చీర, అంచులేదు, మెడలో బంగారంతో చుట్టిన శంఖాల గొలుసు, మెత్తగా, నున్నగా కనబడుతోంది. మెడ, ఒదులుజడ, పూలులేవు. ఒక చేతికి మాత్రం వెడల్పాటి బంగారంగాజు, రవ్వలదుద్దులు చీకట్లో మాసినట్లు కనబడుతున్నాయి.

"ఎందుకు రమ్మన్నానో తెలుసా?"

"మీ కొట్ల విషయం- ఏదీ యింకా శ్యామలరావు ఆ కాగితాలని చదవలేదు" అన్నాను.

"అందుకు కాదు. నిన్ను పైకి తెచ్చింది పార్వతి ఎరుగుదువా? మంచమ్మాయి. భర్త విడిచేశాడు. అతన్ని ఒప్పించి ఇద్దర్ని కలపాలి. "నువ్వు సాయపడాలి" అంది మైథిలి.

"ఏం తప్పుచేసిందట" నవ్వింది.

"పడుచుదనంలో ఆడదీ, మొగాడూ చేసే తప్పే."

"మొగుడున్నాడుగా?"

"దగ్గర లేనప్పుడు కావల్సి వచ్చిందేమో!"

"నేనేం చెయ్యగలను? నాకు కొత్త ఇలాంటి వాటిల్లో అనుభవం లేదు. వీరేశలింగాన్నే తీసుకెళ్ళొచ్చుగా" అన్నాను.

"ఆయన బోలెడు వ్యవహారాలు. ఇలాంటివి పట్టించుకోడు. ఆ వసతి గృహం వర్ధిల్లాలంటాడు. పార్వతి మొగుడుతో కలిసుంటే అతనికేం ప్రయోజనం? మేం కలిసుంటే ఎంత ప్రయోజనమో అదీ అంతే" అని తల వంచింది. వేలునున్న ఉంగరాన్ని తిప్పుతోంది. నా చేతిని తీసి తన తొడపై ఆనించి, రాస్తోంది. ఆమె ఎందుకిలా చేస్తుంది? చిత్రమయిన మనిషి, వేళ్ళతో నా జుట్టుని కదిపి ఆడిస్తోంది. నా ఒళ్ళో వాలింది ఆమె తల. జడ వక్షంపైకి లాక్కుంది. గుండ్రంగా స్థనాలచుట్టూ మూగింది జడ. తన చేతుల్లో నా రెండు చేతులూ తీసుకుని కళ్ళకి ఆనించింది తడి తగిలినట్లనిపించింది.

"తప్పులేదుగా– నీకు పెండ్లవలేదు– నాకూ లేదు."

"వీరేశలింగం....."

"ప్రమాణాలు చేశాడు. కబుర్లు చెప్పుకోడం, కష్టంలో ఆదుకోడం, స్నేహం, అన్యోన్యం, మానసిక బంధం ఇంకేవీ అక్కర్లేదుట. నాకూ కూడ దుట. నాకూ అక్కర్లేదనే పూర్తిగా అతను భావిస్తున్నాడు" అంది మైథిలి.

"నీక్కావాలా?"

"ఎంత అమాయకంగా అడిగావు" అని గట్టిగా నుదిటిని ముద్దు పెట్టుకుంది.

"నాకక్కర్లేదు జీవితంతో పెనుగులాటైపోయింది. కాని నాతో వున్నవాడికి కీడు వాటిల్లుతుందన్న భయం వల్ల నన్ను ఏకాకిని చేస్తే రోషం వచ్చి, అవన్నీ కావాలనిపించి, యిచ్చేవాడిని కట్టుకోబుద్ధి వేస్తుంది."

"నీకేం కావాలి?"

"ప్రతి స్త్రీకి ఏంకావాలో నాకూ అదే. కాని నాకు కావల్సింది ఇచ్చే వాడెవడూ లేడు వీరేశలింగం మీద ఆశ పెట్టుకున్నా, తన మనస్సులో అట్లాంటి భయం లేదన్నాడు. ఈ వయస్సులో వైరాగ్యం మంచిదన్నాడు. త్యాగంలో ఆనందం వుందన్నాడు. అంతే తప్ప, తను నేనేది అడిగితే అది ఇవ్వడానికి సిద్ధం అన్నాడు. అతను నా తొడమీద తల ఆనించి పడుకున్నాడు. అయిష్టంగా ముద్దు పెట్టుకున్నట్లనిపించింది కాదనలేదు, ఇవ్వలేదు. ఏడవక ఏం చెయ్యను !"

అని వెనక నే నెరుగున్న ఆవేదనతో ఆయాసపడుతూంది. శ్వాస వేగంగా వదుల్తూ వుంది. స్థనాలు లేచిపడుతున్నాయి. నా మోహాన్ని వాటి నడుమ అదిమి, కన్నీటితో తడుపుతోంది. ఆ వేడి కన్నీరు ఆవిరై పోతుంది. ఏదో పై గోళం నుండి కిందికి పడిపోతున్నట్లనిపించింది. ఉక్కిరిబిక్కిరయ్యాను. అది చాలా గొప్ప అనుభూతి. అపూర్వమైన అనుభవం. నిజమే కాని నేనింకా సిద్ధంగాలేను. మొహం పైకి తీశాను.

"నువ్వూ అంతే నాకు తెలుసులే" అని చీరకొంగు మొహాన వేసుకొని రోదిస్తోంది.

"నే నెరుగుదును మొగాడినైజం ప్రాణమంటే తీపి. ప్రేమ ప్రేమంటాడు. వాడి ప్రాణంపైననే ఆ ప్రేమంతా."

ఆ క్షణంలో ఇది నిజమేనేమోననిపించింది. నన్ను భయం కుంగదీసి, అసంసిద్ధుణ్ణిగా చేస్తోందా?

"ఆడదానికి మాత్రం వుండదా ప్రాణంపై తీపి!" అన్నాను.

"ఎందుకుండదూ? కాని స్త్రీ ప్రేమనీ, ప్రాణాన్నీ సమంగా చూడగలదు. ఒకదాని కోసం ఒకదాన్ని త్యాగం చెయ్యగలదు."

ఇది బడాయిలా తోచింది.

"నలుగురయ్యారు. ఏవొక్కరికైనా నువ్వు త్యాగం చేశావా?" అన్నాను ధైర్యం తెచ్చుకుని, మైథిలి నాకంటె పెద్దది కావడంవల్ల, కాస్తంత భయం వుండిపోయింది నాలో. సమవయస్కుల మధ్యవుండే ఆప్యాయత ఆమెపట్ల సాధ్యపడింది కాదు.

"నిజమే. నేనే త్యాగమూ చెయ్యలేదు. నేను అల్పురాల్ని సుమా. జీవితంలో ప్రేమని ఎరగనేమో; ఎరిగివుంటే త్యాగం చేసివుందునేమో !"

లేచింది ఆకాశంలో నక్షత్రాలకేసి చూస్తోంది.

"కోపమా?"

"లేదు నీకే కోపమేమో."

"ఏమిటో–నేనూ దేన్ని కూడా, ఆశించడంలేదు. ప్రశాంతంగా వుంది ప్రాణం. ఇతరుల జీవితాలు సంతోషంగా చెయ్యడంలోనే గొప్ప ఆనందం వుందనుకొంటా. అందుకనే వీరేశలింగంగారు నాతో వుంటానంటే కాదనలేకపోయాను. ఈ గొడవతో నిన్ను విసిగిస్తున్నానా? మరి పార్వతి విషయం– వెడదామా?"

"ఊఁ" అన్నాను.

ఎప్పుడో నిర్ణయించుకోలేదు. నేను ఇంటికొచ్చేశాను.

నాలుగైదు నెలల తర్వాత, నా వివాహం జరిగింది. మైథిలికి శుభలేఖ పంపాను. ఆమె రాలేదు. కబురంపలేదు. శుభాకాంక్షలు పంపలేదు. నే నాశ్చర్యపడ్డాను. కాని నెల గడిచాక ఒకరోజు కార్లో పార్వతి దిగింది. నా భార్యకి ఇవ్వవలసిందిగా ఖరీదైన పట్టుచీర పంపింది పార్వతి ద్వారా మైథిలి.

"కార్లో ఆయనెవరు?" అని అడిగాను.

"మావారు" అంది పార్వతి సిగ్గుతో.

మొత్తానికి మైథిలి సాధించింది. పార్వతి భర్తతో ఉంటోంది. పార్వతి మరో వార్త కూడా చెప్పింది. వీరేశలింగం, మైథిలి విడిపోయారుట. అతను స్వగృహానికొచ్చేసి మునుపటి జీవితం సాగిస్తున్నాడుట.

"ఎందుకు విడిపోయారు?" కార్లో తీసుకెళ్ళి తోటలో కూర్చోబెట్టి పార్వతి, ఆమె భర్త కథంతా చెప్పారు.

అది వెన్నెలరాత్రి. చలిరోజులు. వీరేశలింగం, మైథిలి పందిరికింద పరుండి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆమె ఒళ్ళో తలపెట్టి పరున్నాడు. జుట్టు నిమురుతోంది మైథిలి. ఆమెని గట్టిగా కౌగిలించుకుని మీదికి లాక్కున్నాడుట.

"తెగించారే ఈ పూట" అంది మైథిలి. భయమేసిన వాడికిమల్లే ఆమెని చివాలున తోసేశాడు గబగబా వసతిగృహంలో మూలగదిలో దీపం ఆర్పేసి పరున్న పార్వతిని లేపాడుట. ఆమె కెవ్వున కేకేసిందిట. అరిచిందిట. తను ఫలానా అని చెప్పి ఊరుకోమన్నాడుట. ఆమెను గట్టిగా కౌగిలించుకొన్నాడుట. ఆమె ఇంక అరుస్తూనే

వుందిట. మైథిలి గదిలో కొచ్చి దీపం వేసిందట. ఆమె చేతిలో సర్వీస్ రివాల్వారుందిట.

"పార్వతి జీవితం పాడైంది, బాగుచేయడం బదులు ఇదా మీరు చేస్తున్న పని? నాతో వుండే ధైర్యంలేక ఆమెని చెరుద్దామని వచ్చారా? కాల్చెయ్యనా !" అంది మైథిలి. వీరేశలింగం బెదిరిపోయాడుట, వెర్రిగా నవ్వి ఆమె చేతిలో రివాల్వర్ లాక్కుని, "ఇదిగో నా సమస్యకి పరిష్కారం" అని రివాల్వర్ని తన కణతవేపు నిలిపి ట్రిగ్గర్ నొక్కి పేల్చాడుట కాని అది ప్రేలలేదు. తుప్పుమంది మైథిలి నవ్వింది.

''అది మా నాన్నగారిది గుండ్లు లేవు. మిమ్మల్ని చంపుతాననే భయపడిపోయారా? నాకూ మీకూ ఏ రకమైన సంబంధమూ లేదా మరి. అసూయ, ద్వేషం, పగ ఎలా వుంటాయనుకున్నారు? ఈ విషయం ఎవ్వరికీ తెలియకూడదు గప్‌చిప్."

అంతటితో వీరేశలింగం ఆమెనుండి విడిపోయి కొన్నిరోజులు ఎవ్వరికీ కనబడకుండా యాత్రలుచేసి వచ్చేశాడు. మైథిలి పై ఊళ్లో వున్న పెద్ద మేడలోకి వెళ్ళిపోయింది. బిజినెస్ దెబ్బతిని, పొగాకు ధర రాక వీరేశలింగం చిక్కుల్లో వున్నప్పుడు డబ్బిచ్చి ఆదుకుందిట. ఎలెక్షన్ ఖర్చుకోసమని కొంత డబ్బు కేటాయించిందిట.

మేనత్తకి కొంత రాసిందిట. మరికొంత ఆస్థి దానధర్మాలకి రాసేసి, మేడవెనక పూరిపాకలో వుంటోందిట. సాయంత్రం నలుగురూ పోగవుతారుట. భాగవతం చదివి అర్థము చెపుతుందిట. గీత చదివి వ్యాఖ్యానిస్తుందట. భక్తురాలిగా పేరుపడిందట. శిష్యురాండ్రు పోగవుతున్నారుట.

రోజు పాక దగ్గరకు చేరేటప్పటికి మధ్యాహ్నము మూడు దాటింది. తివాచీమీద కూర్చునివుంది. మైథిలి దుస్తులు వైఖరిలో పెద్ద మార్పేమీ లేదు. మెడలో గొలుసు లేదు. చేతికి వెడల్పాటి గాజు అలానే వుంది. చెవులకి దుద్దులు లేవు. నుదుటిమీద పెద్ద కుంకుమబొట్టు బదులుగా మెలితిప్పి ముడివేసిన జుట్టు. అమావాస్యనాడు దట్టమయిన అడవిలో తిరిగే మిణుగురు పురుగులల్లే ఒకటి రెండు తెల్లవెంట్రుకలు. కళ్ళల్లో కారుణ్యం వెలుగుతోంది. ఆమె నవ్వు చూడగానే అలసట, బాధ తగ్గినట్లయింది. సౌందర్యానికి ఆధ్యాత్మిక జీవనం సాధ్యమని నమ్మడానికి సిద్ధంగా వున్నాను.

"నువ్వా !" అంది మైథిలి. నే నెరుగున్న నవ్వు, చీర మడతల వెనక స్ఫుటంగా కనబడే నిండైన స్థనాలు నీడ కనబడే వక్షం, మెడ దిగువున ఒంపు.

దూరంగావున్న ఒకామెకి సంజ్ఞచేసింది. ఆమె మంచినీళ్ళు తెచ్చి అవతలకి వెళ్ళిపోయింది. ఆమె లోనికి వెళ్ళి యేదో తెచ్చి నా ముందు కూర్చుంది. చేతిలో రూపాయల నోట్లు నా ముందు పెట్టింది. నిజానికి నాకా సమయంలో డబ్బు అవసరం. అడుగుదామనే వచ్చా, ఎలా గ్రహించిందో!

"ఇదేమిటి? ఎందుకు?" అన్నాను నోట్లకట్టకేసి చూస్తూ.

"చెక్కు బుక్కు దగ్గరలో లేకపోయింది."

"అది సరే- ఎందుకు?" అన్నాను.

"నువ్వు మామూలుగా సాయంత్రం యేడుదాటాక వచ్చేవాడివి ఇవాళ మూడింటికి వచ్చావు. ఎందుకో ఊహించలేనా ఆ మాత్రం. ఇలాంటి అవసరం యేదో వుంటే తప్ప ఈ సమయంలో రావుగా!" అంది.

కోపం వచ్చినా కాసేపటికి పోయింది. నవ్వొచ్చింది. కోపము కలుగజేసేది, యదార్థంలోని నిజమేనేమో!

"ఇదేమిటి భక్తిమార్గం.....!" అన్నాను.

"ఒక్కొక్కసారి నాకూ నవ్వుగానే వుంటుంది."

"నీకింకా జీవితంతో పెనుగులాట పూర్తికాలేదు. పెళ్ళయింది. వాంఛని చవిచూశావు. ఇంకా కావాలి– మరీ కావాలి బృహదారణ్యక ఉపనిషత్తులో స్త్రీ ఒక నిప్పులాంటిదని వుంది. ఆ నిప్పులోపడి భస్మమయి మరో బిడ్డగా అవతరిస్తాడట, మొగాడు. నిప్పులో, భస్మములో తేడాలులేవు. అన్నీ ఒకటే. పెళ్ళనేది ఆ నిప్పు. ఎంతసేపు మండేదీ, ఆ భస్మము ఎంత ఉండేదీ నిర్ణయిస్తుంది. అందుకనే ఆశ్రమాలు యేర్పరిచారు నాది చివరి ఆశ్రమం, నీది రెండోది. నువ్వన్నట్లు నేనే త్యాగమూ చెయ్యలేదు. దేన్నీ గాఢంగా వాంఛించలేదు, ప్రేమించలేదు నిజానికి నిప్పు, తిరిగిచ్చేది భస్మమే. ప్రతీదీ అందులో కాలాలి, తాను దేన్నీ ఇవ్వదు, అది ఆరిపోగానే చుట్టూ చీకటవుతుంది" అంది మైథిలి.

నా కళ్ళంట నీళ్ళు తిరిగినై. నాగరికత పెరిగినకొద్దీ కన్నీటికి దూరమయిపోతున్నాడా మనిషి అనిపిస్తుంది. దాన్ని ద్రవింపచేసే అవకాశాలు లేకుండాపోవడం నేటి అరిష్టాలలో ఒకటేమో ననిపిస్తుంది. పక్కకు తిరిగి మొహం తిప్పేసి రుమాలుతో తడిని తుడిచేశాను. మరో గంట గడిపి వచ్చేశాను.

ఇంటికి రాగానే పక్కింటి స్నేహితుడు రఘునాధరెడ్డి బైటికెడుతూ అన్నాడు.

"మా ఆవిణ్ణి పురాణ కాలక్షేపానికి తీసికెడుతున్నా ఆ మైథిలిగారి దగ్గరకి."

మైథిలి అప్పుడే "గారు" అయిందిగదా !

"మీరుకూడా ఎందుకు?" అని అడిగాను.

"ఆవిడ చాలా బాగుంటుందిటగా !"

"అవున్లెండి, సౌందర్యంద్వారా కూడా పరమాత్మ లభ్యమవు తాడంటారుగా" అన్నా నవ్వుతూ.

***